

వృక్ష విలాసం

జోగిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు నేడు మహావృక్షాలై నీడనిస్తున్నాయి. అందోలు మండలం మీదుగా వెళ్లే హైవే పక్కన నిజాం కాలంలో మర్రి, రావి మొక్కలను నాటారు. ఇటీవల హైవే విస్తరణలో వందల సంఖ్యలో వృక్షాలను తొలగించినా కొన్ని మాత్రం అలాగే మిగిలిపోయాయి. జోగిపేట పట్టణంలో నుంచి వెళ్లే హైవేను డాకూరు మీదుగా మళ్లించడంతో మండలంలోని దానంపల్లి నుంచి రాంసాన్‌పల్లి వరకు పాత రోడ్డును విస్తరించలేదు. హైవే నుంచి జోగిపేట పట్టణానికి చేరుకోవడానికి ఇది బైపాస్ రోడ్డుగా ఉపయోగపడుతున్నది. ఈ మార్గంలో మూడు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా ఉన్న 200 వృక్షాలను తొలగించలేదు. దీంతో, అవి ఠీవీగా నిలబడి ప్రయాణికులకు నీడను పంచుతున్నాయి. ఈ రోడ్డుపై వెళ్లేవారు చెట్ల కింద ఆగి సేదతీరుతుంటారు.







సన్నాలకు బోనస్.. వరం

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : సన్న వడ్లకు బోనస్ ఇవ్వడం రైతులకు వరం లాంటిదని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి గరువారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో యాసంగి సీజన్‌లో వడ్ల సేకరణ, చెల్లింపు వివరాలను ఆమె వెల్లడించారు. 2024-25 సంవత్సరంలో 1.21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రూ.237 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. సన్నాలకు రూ.1.72 కోట్లు బోనస్ చెల్లించినట్లు తెలియజేశారు. ఈ సంవత్సరం జిల్లాలో అత్యధికంగా ధాన్యం సేకరించడమే కాకుండా రైతులకు అధిక మొత్తంలో చెల్లింపులు జరిపాని పేర్కొన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాల నిర్వహణ, తుది చెల్లింపుల్లో ప్రభుత్వం శ్రద్ధ తీసుకున్నదని తెలిపారు.

మేమూ ఉన్నాం

వారంలో కాంగ్రెస్ కొత్త కమిటీలు

పదవుల కోసం ఉమ్మడి జిల్లా నేతల ప్రయత్నాలు
టీపీసీసీ కార్యవర్గంలో చోటుపై ఆశలు
పలువురికి రేవంత్, మహేశ్‌గౌడ్ ఆశీస్సులు
పార్టీలో కీలక స్థానాలు దక్కే అవకాశం
సీనియర్ల పేర్లను పరిశీలిస్తున్న అధిష్ఠానం



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 29: సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో పునర్వైభవం కోసం కాంగ్రెస్ ప్రయత్నాలు ప్రారంభించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో హుస్నాబాద్ సహా 11 నియోజకవర్గాల్లో.. 4 స్థానాలను మాత్రమే దక్కించుకుంది. సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాలో అందోల్, నారాయణఖేడ్‌లో పార్టీ విజయం సాధించింది. పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు మిశ్రమ ఫలితమే దక్కింది. ఈ క్రమంలో పార్టీని బలోపేతం చేసేందుకు అధిష్ఠానం పావులు కదుపుతున్నది. ఈమేరకు త్వరలో ఏర్పాటు చేయనున్న టీపీసీసీ కార్యవర్గంలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం దక్కవచ్చని భావిస్తున్నారు.

ఆశావహుల ప్రదక్షిణలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో కార్పొరేషన్, నామినేటెడ్ పదవులు దక్కని ఆశావహులు పార్టీ పదవులను ఆశిస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు టీపీసీసీ ముఖ్యుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత పదేళ్లు పార్టీ కోసం శ్రమించామని, ఇప్పుడైనా తమ సేవలను గుర్తించాలని విన్నవిస్తున్నారు. అయితే, టీపీసీసీ కొత్త కార్యవర్గంలో కేవలం సీనియర్లకే ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్ఠానం యోచిస్తున్నట్లు తెలుస్తున్నది. ఉమ్మడి జిల్లా నుంచి కనీసం ఆరుగురికి జాబితాలో చోటు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు ఎవరినీ వరించలేదు. కనీసం పార్టీ పదవులైనా ఇవ్వాలని ఈ జిల్లాల నేతలు అడుగుతున్నారు.

కౌంటర్లు విసిరే నేతలకే అవకాశం

ఓవైపు కాంగ్రెస్‌పై ప్రజల్లో సానుకూల ప్రచారం చేస్తూనే మరోవైపు బీఆర్ఎస్, బీజేపీ నేతల నుంచి వచ్చే విమర్శలను తిప్పికొట్టేవారికే పార్టీ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిసింది. గతంలో ఉమ్మడి జిల్లా నుంచి

మిగతా 6వ పేజీలో

రాష్ట్ర కాంగ్రెస్‌కు వారం రోజుల్లో నూతన కార్యవర్గాన్ని ప్రకటించే అవకాశాలున్నాయి. ఆశావహుల పేర్లను వడగట్టి ఇప్పటికే జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తున్నది. అధిష్ఠానం సూచనల మేరకు మార్పులు చేర్పులు చేస్తున్నారు. కొత్త కమిటీపై ఢిల్లీలో తుది కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నేతలు తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. రాష్ట్ర కార్యవర్గంలో తమ పేర్లనూ పరిశీలించాలని ప్రభుత్వ పెద్దలు, పార్టీలోని ముఖ్యులను ఆశ్రయిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రాబల్యం ఉన్న ప్రాంతంగా గుర్తింపు ఉన్న మెతుకు సీమలో సీనియర్లకు పదవులు ఇచ్చేందుకు అధిష్ఠానం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

ఆరుతడి..

ఆదరణ కొరవడి!



పెరగని సాగు విస్తీర్ణం
వరిపైనే మోజు..
తర్వాత పత్తికి ప్రాధాన్యం
వంద ఎకరాలకే పరిమితమైన జొన్న
2640 ఎకరాల్లో మొక్కజొన్న
140 ఎకరాల్లో సోయా
రైతులకు అవగాహన కల్పించడంలో విఫలం

> ఏటా సాగు ప్రణాళిక ఖరారు చేస్తున్న అధికారులు.. అవి ఏ మేరకు సాగు అవుతున్నాయో పట్టించుకోవడం లేదు. వరి, పత్తిపై పెట్టిన శ్రద్ధ ఆరుతడి పంటలపై పెట్టడం లేదు. దీంతో రోజురోజుకూ ఆరుతడి పంటలకు రైతులు దూరమవుతున్నారు. సాగు ఖర్చు.. విత్తనాలు.. చీడపీడల భయంతో మెట్ట పంటలు అంటేనే భయపడుతున్నారు.

మెదక్, మే 29 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో మరోసారి రైతులు వరి, పత్తి వైపే మొగ్గు చూపుతున్నారని, ఆరుతడి పంటల సాగుపై ఆసక్తి చూపడం లేదని పంటల ప్రణాళిక స్పష్టం చేస్తున్నది. మొత్తం పంటల సాగులో 90 శాతం వరి సాగు చేయనుండగా ఆ తరువాతి స్థానం పత్తిదే. ఈ సీజన్‌లో కూడా ఆరుతడి సాగువిస్తీర్ణం పెరిగే అవకాశాలు కనిపించడం లేదు. జిల్లాలో 2025-26 వానాకాలం సీజన్‌లో 3,50,164 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని జిల్లా వ్యవసాయశాఖ తన ప్రణాళికలో పేర్కొన్నది. ఇందులో 3.05 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయనున్నారని అంచనా. ఆ తరువాత స్థానంలో 37,200 ఎకరాల్లో పత్తి సాగుచేయనున్నారు. ఇక ఆరుతడి పంటలు నామమాత్రంగానే సాగవుతాయని అంచనా వేసింది. 2,640 ఎకరాల్లో మొక్కజొన్న, 1,500 ఎకరాల చొప్పున కందులు, పెసర, మినుములు 550, జొన్న 100, రాగులు, సజ్జలు 40, సోయాబీన్ 140, చెరుకు 50, కూరగాయలు 708,

మిగతా 8వ పేజీలో



హుస్నాబాద్‌లో గూగి వా థియోంగో గుర్తులు

1996లో హుస్నాబాద్‌లోని అమరవీరుల స్థూపం సందర్శన

గుర్తుచేసుకున్న సాహితీవేత్తలు, కవులు

హుస్నాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి) : కెన్యాకు చెదిన అంతర్జాతీయ గుర్తింపు పొందిన రచయిత గూగి వా థియోంగో గతంలో హుస్నాబాద్‌లో పర్యటించారు. 1996లో హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. అనంతరం తన సతీమణితో కలిసి రాష్ట్రంలోని ఉద్యమ ప్రాంతాలను సందర్శించారు. హుస్నాబాద్‌లోని ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద అమరవీరుల స్థూపాన్ని సందర్శించి నివాళులర్పించారు. నాడు ఆయన వెంట చిక్కుడు ప్రభాకర్, పీవీ కొండల్, చలసాని ప్రసాద్ ఉన్నారు. ఆయన గురువారం మృతి చెందడంతో ఇక్కడి సాహితీవేత్తలు, రచయితలు, ప్రజా సంఘాల నాయకులు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

సంప్రదాయ

కళా వైభవం

ఐఐటీహెచ్‌లో మైమరపింపజేసిన సంగీత కచేరీ, నృత్య ప్రదర్శనలు
దేశ, విదేశాల విద్యార్థులు, సాహితీవేత్తల రాక
స్పిక్ మైకే సేవలు అమోఘమని ప్రశంసలు

7లో



ఒక్క రోజు పని కోసం వచ్చి..

తోటి కార్మికుడి హత్య

కాళ్లకల్ పారిశ్రామికవాడలో ఘటన

మనోహరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు కార్మికుల మధ్య గొడవ హత్యకు దారితీసింది. తూప్రాన్ సీఐ రంగాకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కేరళ రాష్ట్రానికి చెందిన నలీన్‌కుమార్(50) మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లోని ఓ పరిశ్రమలో ఓ కాంట్రాక్టర్ ద్వారా నాలుగు రోజుల క్రితం పనిలోచేరాడు. అదే కాంట్రాక్టర్ బుధవారం ఒకరోజు పని కోసం హైదరాబాద్‌కు చెందిన మరో కార్మికుడు నరేష్‌ను రప్పించాడు. రాత్రి ఆలస్యం కావడంతో నలీన్‌కుమార్ ఉన్న గదిలోనే ఉంచాడు. గురువారం ఉదయం సెక్యూరిటీగార్డు వారి గదికి వెళ్లి చూడగా నలీన్‌కుమార్ తలపై గాయంతో రక్తపుమడుగులో పడి ఉన్నాడు. పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. అతడితో పాటు రాత్రి ఉన్న నరేష్ కనిపించలేదు. ఈ విషయంపై పోలీసులకు సమాచారమివ్వగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. బుధవారం రాత్రి ఇద్దరి మధ్య ఏదో విషయంలో గొడవ జరిగి ఉండొచ్చని, మరో కార్మికుడు నలీన్‌కుమార్ తలపై రాడ్డుతో బలంగా కొట్టడంతో తలపగిలి మృతిచెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. హత్యకు కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ పరిశీలించారు. ఎస్ఐ సుభాష్‌గౌడ్ పాల్గొన్నారు.

కాలంచెల్లిన బ్రెడ్ విక్రయించిన

దుకాణాదారుడికి జరిమానా



తూప్రాన్, మే 29 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన బ్రెడ్ విక్రయించిన దుకాణాదారుడికి మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. తూప్రాన్ పట్టణానికి చెందిన నవీన్ గురువారం ఓ కిరాణా దుకాణంలో బ్రెడ్‌ప్యాకెట్‌ను కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లిన తరువాత ప్యాకెట్ విప్పిచూడగా బ్రెడ్ పాడైనట్లు గుర్తించాడు. బ్రెడ్ ప్యాకెట్‌పై తేదీ గడువు తీరిపోయింది. దీంతో, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చింతల మధు, వార్డు ఆఫీసర్ ఇర్ఫాన్ తనిఖీలు నిర్వహించగా కాలం చెల్లిన బ్రెడ్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో దుకాణం యజమానికి రూ.1,500 జరిమానా విధించారు.



అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో 161వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

వానాకాలం వచ్చినా వడ్లు కొనరా?

- ధాన్యం కొనుగోలులో జాప్యంపై నిరసన
- గడిపెద్దాపూర్‌లో హైవేపై అన్నదాతల రాస్తారోకో

అల్లాదుర్గం, మే 29 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్‌లో గురువారం హైవే 161ని దిగ్బంధించారు. గంటపాటు రాస్తారోకో కొనసాగడంతో వందలాదీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గడిపెద్దాపూర్‌లోని కొనుగోలు కేంద్రానికి తెచ్చిన వడ్లను తూకం వేసి మిల్లుకు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆరోపించారు. తుందన్నారు. పది రోజులుగా నిత్యం వర్షం కురుస్తుండటంతో ధాన్యం తడుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి చేరుకొని రైతులను సముదాయించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. వెంటనే తూకం వేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఆందోళన వద్దు : జిల్లా అధికారులు

రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న పౌరసరఫరాల జిల్లా అధికారి సురేష్‌రెడ్డి, డీఎం జగదీప్‌కుమార్ గడిపెద్దాపూర్, అల్లాదుర్గంలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులతో మాట్లాడుతూ ఆందోళన చెందవద్దని, వారం రోజుల్లో వడ్లు పూర్తిగా కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. తహసీల్దార్ మల్లయ్య, ఐకేపీ ఏపీఎం నాగరాజు వారి వెంట ఉన్నారు.

త్వరగా తూకం వేయాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణపూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రాలకు తీసుకువచ్చిన వడ్లను త్వరగా తూకం వేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని భూర్గుపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 2.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, రైతులకు రూ.579.96 కోట్ల చెల్లింపులు చేశామని తెలిపారు. జిల్లాలో 496 కొనుగోలు కేంద్రాలను తెరవగా ధాన్యం సేకరణ పూర్తయిన 223 సెంటర్లను మూసివేశామని వెల్లడించారు.



భూర్గుపల్లి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి వడ్లలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

యోగా శిక్షకులేరీ?

నిలిచిన ఇన్‌స్ట్రక్టర్ల నియామకం
సంగారెడ్డి జిల్లాలో 14 ఆయుష్ డిస్పెన్సరీలు
వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం
యోగాపై 25 రోజుల షెడ్యూల్
శిక్షకులు లేక కార్యక్రమాల నిర్వహణపై అయోమయం



సంగారెడ్డి ఇంద్రనగర్‌లోని ఆయూష్మాన్ ఆరోగ్య మందిర్

సంగారెడ్డి అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో యోగా శిక్షకుల నియామకాలకు బ్రేక్ పడింది. శిక్షకుల నియామకం కోసం ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి ఆరు నెలల కిత్రమే ఆయూష్‌శాఖ మెదక్ జిల్లా కేంద్రంగా ఇంటర్వ్యూలు నిర్వహించింది. డిస్పెన్సరీకి ఇద్దరు చొప్పున ఇన్‌స్ట్రక్టర్లను ఎంపిక చేసింది. కానీ, ఉమ్మడి జిల్లా పరిధిలోని మెదక్, సంగారెడ్డి జిల్లాలు వేర్వేరు జోన్లలో ఉండటంతో నియామకాలకు ఆటంకంగా మారింది. జోన్‌ల పంచాయితీ తలెత్తడంతో పాటు ఆయూష్‌శాఖ డైరెక్టర్ మారడంతో నియామకాల ఫైలును ఉన్నతాధికారులు పక్కన పెట్టేసినట్టు తెలిసింది. దీంతో, సంగారెడ్డి జిల్లాలో యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామక ప్రక్రియ పూర్తికాలేదు.

ప్రత్యేక కార్యక్రమాలకు ఆటంకం

అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 నిర్వహించనుండటంతో ఆయూష్‌శాఖ ఏటా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ నెల 27 నుంచి.. వచ్చే నెల 21 వరకు వివిధ యోగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆ శాఖ ఆదేశించింది. ఈమేరకు రోజూవారీ షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. సంగారెడ్డి జిల్లాలో 14 ఆయూష్ డిస్పెన్సరీలు ఉన్నాయి. ఆయూష్ శాఖ పరిధిలోని ఆయుష్మాన్

మిగతా 8వ పేజీలో

కుంటల ఆక్రమణపై విజిలెన్స్ విచారణ

హైడ్రాకు నివేదిక అందజేసిన నీటిపారుదలశాఖ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఐడీఏబొల్లారం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఐడీఏబొల్లారం మున్సిపాలిటీ పరిధిలో కుంటలను మాయం చేసిన ఘటనపై విజిలెన్స్ విచారణ ప్రారంభమైంది. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన 'కుంటలు చెరబట్టి రియల్ దందా' కథనానికి ఉన్నతాధికారులు స్పందించి విచారణకు ఆదేశించారు. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు 23 కుంటలకుగాను.. రికార్డుల్లో 15 కుంటలుగా చూపడంపై విచారణ చేపట్టారు. మాయమైన కుంటల వివరాలు సేకరిస్తున్నారు. రికార్డుల ప్రకారం ఐడీఏబొల్లారంలో ఉన్న కుంటల పూర్తిస్థాయి సమాచారంతో హైడ్రాకు నివేదిక ఇచ్చినట్లు నీటిపారుదలశాఖ ఏఈ ప్రసాద్ చెప్పారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి



పటాన్‌చెరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని నాగులపల్లి ఓఆర్ఆర్ వద్ద చోటుచేసుకుంది. సీఐ స్వామి గౌడ్ కథనం ప్రకారం గుంటూరు జిల్లా అమరావతి మండలానికి చెందిన చల్లంచెర్ల ప్రభుదాస్(33) నాగులపల్లిలో నివాసముంటూ తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. గురువారం పని ముగించుకుని పల్సర్ బైక్‌పై వస్తుండగా ఓఆర్ఆర్ ఎగ్జిట్-2 100 ఫీట్ల రోడ్డు వద్ద ఎదురుగా రాంగ్ రూట్లో ఓవర్ స్పీడ్‌లో వస్తున్న స్పెండర్ బైక్ ఢీకొనడంతో ప్రభుదాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తూప్రాన్‌లో ఆవుల పట్టివేత

తూప్రాన్, మే 29 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న గోవులను గురువారం రాత్రి పట్టుకున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ నుంచి లారీ సుమారు 40 పశువులను తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి వద్ద బీజేపీ నాయకులు కాపు కాసి లారీని పట్టుకున్నారు. లారీలో సుమారు 12 ఆవులు ఉండగా, మిగతావి ఎద్దులు, గేదెలు, లేగదూడలు ఉన్నాయి. పట్టుబడిన లారీని పోలీసులకు అప్పగించగా, పశువులను మాసాయిపేట మండలంలోని రామంతాపూర్ శివారులోని గోశాలకు తరలించారు.

చాలాన్లు..!

ఎడాపెడా బాదుడుతో వాహనదారుల బెంబేలు

- ట్రాఫిక్ నియంత్రణ మరిచి కెమెరాలను తెరిచి..
- ప్రభుత్వ ఖజానా నింపేందుకు పోలీసుల పోటీ
- మద్యం షాప్ పక్కనే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలా?
- వాహనదారులకు ఏటా రూ.కోట్లల్లో జరిమానాలు

సంగారెడ్డి క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో వాహనచోదకులపై పోలీసులు ప్రతాపం చూపిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఉల్లంఘన పేరుతో వాహనదారులపై జరిమానాల రూపంలో విరుచుకుపడుతున్నారు. వాహనాలు నడిపే సమయంలో వాహనదారులు వాహనానికి సంబంధించిన అన్ని ధృవపత్రాలు దగ్గర ఉంచుకోవడంతో పాటు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పోలీసులు వివిధ సందర్భాల్లో సూచిస్తున్నారు. కానీ జిల్లాలో ద్విచక్ర చాలావరకు వాహనచోదకులు హెల్మెట్ లేకుండానే వాహనాలను నడుపుతున్నారు. ఈ తరుణంలో రాష్ డ్రైవింగ్ చేస్తూ కిందపడిపోవడమో, ఇతరులకు ఢీకొట్టడమో జరిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయం కాకుండా హెల్మెట్ ఉపయోగపడుతుందని పోలీసులు చెబుతున్నా వాహనచోదకులు పట్టించుకోవడం లేదు. దీంతో పోలీసులు ఉల్లంఘనులపై భారీగా జరిమానాలతో బాదేస్తున్నారు.

రూ.కోట్లల్లో జరిమానాలు

జిల్లాలోని పలు ప్రధాన కూడళ్లల్లో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఏటా కోట్ల రూపాయల జరిమానాలు విధిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాను నింపేందుకు పోలీసులు పోటీ పడుతున్నారు. ప్రతి సంవత్సరం కోట్లల్లో జరిమానాలు విధించడంతోపాటు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనకు సంబంధించి గత మూడు సంవత్సరాల్లో సంగారెడ్డి జిల్లాల్లో కోట్లలో జరిమానాలు విధించారు.



సంగారెడ్డి పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

డ్రంకెన్ డ్రైవ్ కేసులు, జరిమానాలు

సంవత్సరం	కేసులు	జరిమానాలు
2022	6369	69,42,795
2023	11404	1,15,55,200
2024	8676	1,13,50,293

మద్యం దుకాణాల పక్కనే..

మద్యం సేవించి వాహనం నడపడం నేరం అయినప్పటికీ పోలీసులు మాత్రం అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలే తప్ప మద్యం షాక్ పక్కనే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించడం ఎంతవరకు సమాంజసమని ప్రశ్నిస్తున్నారు. మద్యం దుకాణానికి కొద్ది దూరంలోనే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి వేలల్లో జరిమానాలు వేస్తున్నారని వాహనచోదకులు వాపోతున్నారు. ఇలా గత మూడు సంవత్సరాల్లో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల ద్వారా పెద్ద ఎత్తున కేసులు నమోదు చేయడం, జరిమానాలు విధించడంతోపాటు పలువురిని జైలుకు పంపారు.

ట్రాఫిక్ నియంత్రణ విస్మరించి..

జిల్లాలోని వివిధ ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు ట్రాఫిక్ నియంత్రించాల్సి ఉండగా చేతిలో కెమెరాలు పట్టుకొని వాటికి పని చెబుతున్నారు. వాహనంపై ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం, సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్లల్లో వెళ్లడం, అతివేగంగా వెళ్తున్న వారిని గుర్తించి వారి ఫొటోలను కెమెరాల్లో బంధిస్తున్నారు. అనంతరం ఆన్‌లైన్ ద్వారా చాలాన్ల రూపంలో వాహనచోదకులకు పంపుతున్నారు. ఒక వాహనంపై భార్యాభర్త, కొడుకు కలిసి వెళ్లడం కొన్ని సార్లు అనివార్యమవుతోందని, ఆ సందర్భంలో కూడా పోలీసులు ఆన్‌లైన్ ద్వారా చలాన్లు వేస్తున్నారని వాపోతున్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనల జరిమానాలు ఇలా..

సంవత్సరం	కేసులు	జరిమానాలు
2022	2,89,244	12,11,68,987
2023	2,44,593	9,59,53,273
2024	1,94,888	7,78,47,962

రేసులో మేమూ ఉన్నాం

(5వ పేజీ తరువాయి)

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జగ్గారెడ్డిని ఎంపిక చేశారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు, అధికారంలోకి వచ్చాక తనదైన పాత్రను పోషిస్తున్నారు. అధిష్టాన పెద్దలను, ప్రభుత్వాన్ని ఎవరైనా విమర్శలు చేస్తే వెంటనే స్పందిస్తారనే పేరుంది. దీంతో నూతన కమిటీలో ఆయనకు కీలక స్థానం దక్కవచ్చనే ప్రచారం జరుగుతోంది. అదే విధంగా జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, పోటీచేసి ఓడిపోయిన నేతలు, ఇతర నాయకుల పేర్లను పరిశీలిస్తున్నారు. పదవులు ఆశిస్తున్నవారిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లుగా తెలిసింది. గత పదేళ్లలో వారు అనుసరించిన అంశాలను సైతం పరిగణనలోకి తీసుకుంటున్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లను ఎదుర్కోవడం, కాంగ్రెస్‌ను బలోపేతం చేసిన విషయాలపైనా ఆరా తీస్తున్నారు.

అధిష్టానం ఆరా

ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆశీస్సులు ఉన్నవారికే పదవులు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆశావహుల గత నేపథ్యంతో పాటు భవిష్యత్‌లో పార్టీకి ఉపయోగపడేవారికే ప్రాధాన్యత ఇవ్వనున్నారు. త్వరలోనే స్థానిక, గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతాయనే సంకేతాలు ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికలను సైతం నిర్వహించాల్సి ఉంది. దీంతో ఎన్నికల్లోనూ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేసే సత్తా ఉన్నవారినే ఎంపిక చేయనున్నారనే సమాచారం. మళ్లీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకూ ఇదే కార్యవర్గం కొనసాగే అవకాశాలు ఉన్నాయి. అప్పటికి కూడా పార్టీని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేవారిపైనే అధిష్టానం దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది. ఇలాంటి వారికే ప్రభుత్వ పెద్దలు, పార్టీ ముఖ్యుల ఆశీస్సులు దక్కనున్నాయి. మరో వారం రోజుల్లోపలే కొత్త కార్యవర్గం ప్రకటిస్తున్నందున ఆశావహులు అటు ఢిల్లీ, ఇటు హైదరాబాద్‌లో మకాం వేసినట్లుగా తెలుస్తున్నది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సదాశివపేట, మే 29: (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం గొల్లగూడెం గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గ్రామ సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారి పక్కన నిర్మాణంలో ఉన్న ఓ భారీ కాలువలో 40 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. వారిచ్చిన సమాచారం మేరకు అక్కడి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు బూడిద రంగు ప్యాంటు, నీలం రంగు గీతల షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

● ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన



అన్నపూర్ణ మృతదేహం

సదాశివపేట, మే 29: (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ మహిళ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మునిపల్లి మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన అన్నపూర్ణ(45) సదాశివపేట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే అన్నపూర్ణ మృతి చెందిందని ఆమె బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుకున్న పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకోవడంతో ఆందోళన సద్దుమణిగింది. మృతురాలి కుటంబానికి ఆసుపత్రి వర్గాలు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించినట్టు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మహిళ ఇంట్లోకి చొరబడిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ ఆసిఫ్

నంగునూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మహిళ ఇంట్లో చొరబడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రాజగోపాలపేట ఎస్ఐ మహ్మద్ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత తన తల్లిగారింటి వద్ద ఉంటున్నది. పాలమాకుల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ సంపంగి మహేశ్ తనకు పరిచయం ఉన్న ఆ మహిళ ఇంటివద్ద మంగళవారం రాత్రి తన స్నేహితుడు పల్లెపు సంపత్‌ను బయట కాపలా ఉంచి ఇంట్లోకి చొరబడ్డాడు. దీంతో మేల్కొన్న సదరు మహిళ కేకలు వేయగా, ఆమె తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు మేల్కొనడంతో నిందితులు బైక్‌పై పారిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని బుధవారం బస్టాండ్ వద్ద ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉజ్జయిని మహంకాళీ ఆలయంలో చోరీ

తూప్రాన్, మే 29 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని పురాతనమైన ఉజ్జయిని మహంకాళీ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ చోటుచేసుకున్నది. పట్టణంలోని పోతరాజుపల్లిలోని నాలుగిళ్లలో చోరీ జరిగిన మరుసటి రోజే ఈ ఆలయంలో చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి ఆ ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు రెండు హుండీల తాళాలు ధ్వంసం చేసి నగదు తస్కరించారు. అమ్మవారి గర్భగుడి ద్వారం తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నించి విరమించుకున్నట్లు అనుమానిస్తున్నారు. గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న పూజారి చోరీ విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



గణేష్ (ఫైల్)

రామాయంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని దామరచెరువు గ్రామంలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గణేష్ (25) కొన్ని రోజులుగా హైదరాబాదులో ఉంటూ నాలుగు రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గణేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

మరో ఘటనలో..



శివకుమార్ మృతదేహం

సదాశివపేట, మే 29: (ఆంధ్రజ్యోతి) : యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. మునిపల్లి మండలం కల్లపల్లి బేలూరు గ్రామానికి చెందిన శివకుమార్(26) గురునగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. శివకుమార్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

అదుపుతప్పి ధాన్యం లారీ బోల్తా

నిజాంపేట, మే 29(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి లారీ బోల్తా పడిన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలోని రైతు వేదిక సమీపంలో గురువారం రామాయంపేట నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న వడ్ల లారీ డ్రైవర్ అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు.



'గీతం'లో ఏఐ-ఎంఎల్ వర్క్‌షాప్

ఇంజనీరింగ్ అధ్యాపకులకు అవగాహన

పటాన్‌చెరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కోర్ ఇంజనీరింగ్(ఏరోస్పేస్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్) అధ్యాపకులకు ఏఐ-ఎంఎల్ లను పరిచయం చేయడంతో పాటు, వాటిపై పూర్తి అవగాహన కల్పించేందుకు రెండు రోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి ప్రారంభించి, ఈ సదవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్క్‌షాప్‌ను ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్, డాక్టర్ వి.శిరీష, డాక్టర్ చంద్రశేఖర్ సమన్వయం చేస్తున్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

● జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు



హ్యాండ్‌బాల్ శిబిరంలోని విద్యార్థులతో దేశబోయిని నర్సింహులు

గజ్వేల్ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు సూచించారు. కొడకండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన సంక్షేమ క్రీడల శాఖ సహకారంతో వ్యాయామ ఉపాధ్యాయురాలు విశాల ఆధ్వర్యంలో హ్యాండ్‌బాల్‌లో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు మానసికోల్లాసం, శారీరక ఎదుగుదల ఎంతో అవసరమని, ప్రస్తుత సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపోటములను పట్టించుకోకుండా క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సూచించారు. బాలల గొప్ప ఆశయం ఏర్పరచుకొని సాధన దిశలో ప్రయాణించాలని చెడు అలవాట్లకు లోనుకావద్దని చిన్న విషయాలకు కృంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. హ్యాండ్‌బాల్ వేసవి శిబిరంలో మెలకువలు నేర్చుకొని పరిణితి సాధించి జిల్లా, రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయిలో మంచి పేరు తేవాలన్నారు.


అక్కన్నపేట మండలం కుందనవానిపల్లిలో రైతు పొలంలో మట్టి నమూనాలను సేకరిస్తున్న ఏఈవో శ్రీలత

పంట దిగుబడి పెరగాలంటే సారవంతమైన భూమి అవసరం. పంటకు కావలసిన పోషకాలు కొంత మోతాదులో మట్టిలోనే సహజంగానే ఉంటాయి. నేలలో లవణాల రూపంలో కరిగి ఉన్న ఈ పోషకాలు మొక్క ఎదుగుదలకు అవసరమవుతుంది. అందుకే ఏ భూమిలో పోషకాలస్థాయి ఏ మేరకు ఉందో తెలుసుకోవాలంటే రైతులు ప్రతీ రెండేళ్లకు పొలంలో మట్టి పరీక్షలను తప్పకుండా చేయించుకోవాలి.

- అక్కన్నపేట, మే 29 (ఆంధ్రజ్యోతి)

మట్టి మేలు తలపెట్టవోయ్

భూసార పరీక్షలతో పంటలకు రక్ష

ఫలితాల ఆధారంగా పంటల సాగు, ఎరువుల వినియోగం చేపట్టాలి

దిగుబడి నష్టాలను తగ్గించుకునే అవకాశం

మట్టి నమూనా అనేది మొత్తం పొలాన్ని యూనిట్‌గా తీసుకుంటారు. పొలం ఖాళీగా ఉండే సమయంలో ఎప్పుడైనా మట్టి నమూనా తీసుకోవచ్చు. సాధారణంగా ఒక పంట పండించే భూమిలో ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెల మధ్యలో, రెండు పంటలు పండించే చోట్ల మే నెలలో మట్టి నమూనాలు సేకరించుకోవాలి. పొలమంతా ఒకేరకంగా ఉంటే ఐదు ఎకరాల విస్తీర్ణానికి ఒక నమూనా చొప్పున తీసుకోవాలి. అదే భూమి రకంలో వ్యత్యాసం ఉంటే వేర్వేరుగా నమూనాలు తీసుకోవాల్సి ఉంటుంది.

నమూనా సేకరణ ఇలా..

పొలంలో 10 నుంచి 12 చోట్ల మట్టి నమూనా తీసుకోవాలి. ముందుగా నేలపైన చెత్తచెదారం తీసివేసి వి ఆకారంలో 6 అంగుళాల లోతులో గుంత తీసుకోవాలి. తరువాత పైనుంచి కిందకు ఒక పలుచని మట్టి పొర వచ్చే విధంగా పారతో మట్టిని తీసుకోవాలి. ఈ రకంగా 10, 12 చోట్ల నుంచి సేకరించిన మట్టిని ఒక ప్లాస్టిక్ కవర్‌లో లేదా గోనెసంచి, ప్లాస్టిక్ బకెట్‌లో వేసుకోవాలి. తరువాత ఈ మట్టిని చతురప్రాకారంలో నేలమీద గానీ లేదా గోనె పట్టాపైన గాని పరుచుకోవాలి. మొత్తం మట్టిని సమ భాగాలుగా వచ్చేలా అడ్డంగా నిలువుగా గీతలు గీయాలి. ఎదురెదురుగా ఉన్న భాగాలను తీసివేయాలి. ఇలా చేసిన తరువాత రెండు భాగాలు మిగులుతాయి. ఈ రెండు భాగాలను కలిపేసి మళ్లీ నాలుగు సమ భాగాలుగా చేసుకోవాలి. ఈసారి ఎదురెదురుగా ఉన్న రెండు భాగాలను తీసివేసి, మిగిలిన రెండు భాగాలను కలుపుకోవాలి. ఈ విధంగా మనకు ఒక అరకిలో మట్టి వచ్చేవరకు చేసుకుంటే మొత్తం పొలాన్నంతా ప్రతిబింబించే మట్టి నమూనా సేకరించే అవకాశం ఉంటుంది. భూపరీక్ష ఫలితాలు కూడా సరిగా వచ్చేందుకు దోహదం చేస్తుంది. సేకరించుకున్న మట్టిని పాలిథిన్ సంచిలో వేసి, దానిపైన రైతు పేరు, గ్రామం, మండలం, సర్వే నంబరు, పొలం విస్తీర్ణం, మూడు కాలాలుగా పండించిన పంటల వివరాలు, తరువాత వేయబోయే పంటల వివరాలు, సాగు నీటి వివరాలు, నమూనా సేకరించిన తేదీ సమాచారం అంతా రాసి భూసార పరీక్షా కేంద్రానికి పంపించాలి.

> **రెండేళ్లకోసారి చేయించుకోవాలి**
>
> రైతులు మట్టి పరీక్షల ఫలితాలను బట్టి పంటలు సాగు చేసుకోవాలి. రెండేళ్లకోసారి మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించుకోవాలి. మట్టి పరీక్ష ఫలితాలు వచ్చిన తర్వాత ఏ పంటలు వేసుకోవాలి, దిగుబడి కోసం ఎలాంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలో తెలుస్తుంది. వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు ఎరువులు వాడాలి.
>
> - కరంటోతు శ్రీలత, మండల వ్యవసాయ విస్తరణ అధికారి, రామవరం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చెట్ల కింద, గట్ల పక్కన, కంచెల దగ్గర, కాలి బాటలలో మట్టి నమూనా తీయకూడదు. పశువుల ఎరువు కుప్పల దగ్గర, పిట్ల కంపోస్ట్ పడే దగ్గర నమూనా సేకరించవద్దు సారవంతంగా ఉన్న భూమిలోనూ, బాగా నిస్సారంగా ఉన్నచోట్ల కలిపి మట్టి నమూనా తీయకూడదు. చౌడు భూముల్లోనూ, సారవంత భూమిలోనూ కలిపి నమూనా తీయకూడదు. గుంతలు తీసేటప్పుడు పైన ఉన్న చెత్త చెదారం తీసివేయాలే గానీ పైన ఉన్న మట్టి పొర తొలగించకూడదు. బురద నేలలో సేకరించవద్దు. చౌడు ఎక్కువగా ఉన్న నేలల్లో పైనుంచి 15 సెంటీమీటర్ల వరకు ఒక నమూనా, 15 నుంచి 30 సెంటీమీటర్ల వరకు మరో నమూనా తీసుకోవాలి.

పోషకాల స్థాయిని బట్టి ఎరువులు

నేలలో ఉన్న నత్రజని, భాస్వరం, పొటాష్ మూలకాల పరిమాణం ఎంత ఉందనే విషయం తెలుసుకోవచ్చు. ఒకవేళ పోషకాలు తక్కువగా ఉంటే సిఫారసు చేసిన ఎరువుల పరిమాణంలో 25శాతం పెంచి వేసుకోవాలి, ఎక్కువగా ఉంటే 25శాతం తగ్గించి వేసుకోవాల్సి ఉంటుంది. ఇక సేంద్రియ కర్బనం పరిమాణాన్ని బట్టి ఎంత మోతాదులో ఎరువులు వేసుకోవాలి అనే విషయం భూపరీక్షతో తెలుసుకోవచ్చు. దీంతో పాటుగా జింక్, ఇనుము, మెగ్నీషియం, బోరాన్ వంటి సూక్ష్మపోషక లోపాల గురించి తెలుసుకొని దానికి అనుగుణంగా నివారణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.


చిన్నకోడూరు మండలం శంకరాయకుంటలో సాగు చేసిన జీలుగు

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

చిన్నకోడూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట పంటను సాగుచేసి పూత దశకు రాగానే కలియదున్నితే భూసారం పెరిగి నేల ఆరోగ్యంగా ఉంటుంది. పంటలకు మేలు చేసే సూక్ష్మజీవుల మోతాదు పెరుగుతుంది. దీంతో తర్వాత వేసే పంటలకు పోషకాలు లభ్యత బాగుంటుంది. సాధారణంగా పచ్చిరొట్ట విత్తనాలను 40 రోజుల ముందే సాగుచేయాలి. ఉమ్మడి జిల్లాలో ముందస్తు నాట్లు ఎక్కువగా వేయరు. జూన్ తర్వాతే నాట్లు ఊపందుకుంటాయి. ఇంకా నెలరోజులకు పైగా వరి పంటకు సమయముంది. దీంతో ప్రస్తుతం రైతులు జీలుగు, జనుము విత్తనాలు విత్తుకునే పనిలో నిమగ్నమయ్యారు. పలు గ్రామాల్లో ఇప్పటికే సాగు చేశారు.

సబ్సిడీపై జీలుగు, జనుము విత్తనాలు

ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తుంది. జీలుగు, జనుము విత్తనాలను అందుబాటులో ఉంచింది. జీలుగు 30 కిలోల బ్యాగు రూ.4,275 ఉండగా, సబ్సిడీ 50 శాతం తీసేయగా రైతులు రూ.2,137.50 చెల్లించాలి. జనుము 40 కిలోల బ్యాగు రూ.5,020 ఉండగా సబ్సిడీ 50 శాతం పోగా రైతులు రూ.2,510 చెల్లించాల్సి ఉంటుంది. జీలుగ, జనుము విత్తనాలను ఎకరాకు 10 నుంచి 12 కిలోలు చల్లుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అయితే, ఎక్కడ చూసిన రైతులు జీలుగు, జనుము విత్తనాల కోసం బారులు తీరి కనిపిస్తున్నారు. ఈసారి కావల్సినంత విత్తనాల స్టాక్ రాకపోవడంతో పచ్చిరొట్ట సాగు తగ్గే అవకాశమున్నది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



పచ్చిరొట్ట సాగుతో భూమిలో నత్రజని స్థిరీకరింపబడి నేల సారవంతంగా మారుతుంది. దీంతో పంట దిగుబడి పెరుగుతుంది. గ్రామాల్లో రైతులకు పచ్చిరొట్ట సాగుపై అవగాహన కల్పిస్తున్నాం.

- జయంత్‌కుమార్, ఏవో, చిన్నకోడూరు

జీలుగు విత్తనాల కోసం

పోటెత్తిన రైతులు

కంది, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కందిలోని పీఏసీఎస్ సెంటర్ వద్ద గురువారం జీలుగు విత్తనాల పంపిణీ చేస్తున్నారని తెలిసి రైతులు పోటెత్తారు. అయితే, మండలంలో దాదాపు 1500 బస్తాలు అవసరం ఉండగా, కేవలం 167 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రైతులు మాత్రం అంతకు రెండు రెట్లు ఎక్కువగా వచ్చారు. పీఏసీఎస్ చైర్మన్ దొడ్ల ప్రభాకర్ రెడ్డి, సీఈవో మందాడ శ్రీధర్‌రెడ్డి పీఏసీఎస్ వద్దకు వచ్చిన రైతుకు టోకెన్లు పంపిణీ చేసి వారే దగ్గర ఉండి విత్తనాలు పంపిణీ చేశారు.



కంది పీఏసీఎస్ సెంటర్ వద్ద రైతులు

సర్కారు బడి.. నూతన ఒరవడి

ప్రైవేటుకు దీటుగా నడుస్తున్న జడ్పీహెచ్‌ఎస్‌లు

వసతుల్లో పర్ఫెక్ట్.. బోధనలో బెస్ట్.. క్రీడల్లో ఫస్ట్

పీఎంశ్రీకి ఎంపికైన కుకునూరుపల్లి స్కూల్

ప్రత్యేకత చాటుతున్న చిన్నకిష్టాపూర్ పాఠశాల

కుకునూరుపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి) : బోధనలో, ఫలితాల్లో, క్రీడల్లో, వసతుల కల్పనలో అన్నింటా ఉత్తమంగా నిలుస్తూ ప్రైవేటుకు దీటుగా పనిచేస్తున్నాయి ఈ సర్కారు బడులు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్పొరేట్ పాఠశాలలతో పోటీ పడి ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రైవేటు నుంచి సర్కారు బడికి విద్యార్థులను చేర్చుకునేస్థాయికి చేరుకుని నూతన ఒరవడిని సృష్టిస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలోని అవే కుకునూరుపల్లి, చిన్నకిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు.

ప్రైవేటు నుంచి ప్రభుత్వ బడికి...

అన్ని వసతులతో పాటు ఉపాధ్యాయ బృందం ఉత్తమ బోధనతో చదువులో రాణిస్తున్న విద్యార్థుల ప్రతిభ చూసి ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలను తల్లిదండ్రులు కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పిస్తున్నారు. గత సంవత్సరం ప్రైవేటు పాఠశాల నుంచి దాదాపు 40 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో అడ్మిషన్‌లు తీసుకున్నారు. గత సంవత్సరం జిల్లా స్థాయి క్రీడా పోటీలకు, ఈ ఏడాది మండల స్థాయి పోటీలకు కుకునూరుపల్లి జడ్పీహెచ్‌ఎస్ ఆతిథ్యం ఇచ్చింది. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన



కుకునూరుపల్లి జడ్పీహెచ్‌ఎస్

విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాఠశాలలో వసతులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాలుగా పదో తరగతిలో 10 జీపీఏ సాధిస్తూ పలువురు విద్యార్థులు ట్రిబుల్ ఐటీకీ ఎంపికయ్యారు. పదో తరగతి ఫలితాల్లోనే కాదు ఈ పాఠశాల విద్యార్థులు టేబుల్ టెన్నిస్, బాక్సింగ్ వంటి క్రీడల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కుకునూరుపల్లి జడ్పీహెచ్‌ఎస్ పీఎంశ్రీ పథకానికి ఎంపిక కావడం విశేషం. దీంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ పాఠశాల మరింత అభివృద్ధికి బాటలు పడ్డాయి. కుకునూరుపల్లి మాజీ సర్పంచ్ పోల్కంపల్లి నరేందర్ సహకారంతో పాఠశాలను ఉత్తమంగా తీర్చిదిద్దారు. ఇప్పటివరకు దాదాపు రూ.40 లక్షల వరకు సహాయసహకారాలను అందజేశారు.

చిన్నకిష్టాపూర్ చిచ్చరపిడుగులు

కుకునూరుపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు దీటుగా మండలంలోని చిన్నకిష్టాపూర్ పాఠశాల విద్యార్థులు రాణిస్తున్నారు. అటు చదువులో ఇటు క్రీడల్లో వారితో సమానంగా నిలుస్తున్నారు. ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ఈ పాఠశాల 527 మార్కులతో ప్రభుత్వ పాఠశాల విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. మరో నలుగురు విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. పదో తరగతిలో 37 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 36 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలతో కూడిన కరపత్రాన్ని ముద్రింపజేసి ప్రచారాన్ని సైతం నిర్వహిస్తున్నారు. పాఠశాలలో క్రీడా సామగ్రి, పాఠ్యపుస్తకాలు, సీసీ కెమెరాలతో పాటు అన్ని వసతులు ఉండడంతో ఈ పాఠశాలలోనూ తల్లిదండ్రులు విద్యార్థులను చేర్పేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.



చిన్నకిష్టాపూర్ స్కూల్ ప్రచార కరపత్రం

'రోడ్డు మూసేయొద్దు.. బ్రిడ్జి నిర్మించాలి'

● రామాయంపేట బైపాస్‌లో బైఠాయించిన స్థానికులు

● రోడ్డు మూసివేత పనుల అడ్డగింత

రామాయంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట బైపాస్ జంక్షన్ మలుపులో రోడ్డు మూసివేసే పనులను స్థానికులు అడ్డుకున్నారు. తరచూ ప్రమాదాల నేపథ్యంలో నేషనల్ హైవే అథారిటీ గురువారం తాత్కాలిక పనులకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న గోల్పర్తివాసులు అధికారులను నిలదీశారు. పనులు అడ్డుకుని ఇందుకోసం తెచ్చిన మెటీరియల్‌ను అవతల పడవేశారు. అంతేకాకుండా 'రోడ్డును మూసేయొద్దని.. మాకు బ్రిడ్జి నిర్మాణమే కావాలి' అంటూ రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఇప్పటికి రెండుసార్లు అడ్డుకుని అధికారులను నిలదీయడంతో వారు వెనుదిరుగక తప్పలేదు.


మెటీరియల్‌ను తీసేస్తున్న స్థానికులు


రామాయంపేట బైపాస్‌లో బైఠాయించిన గోల్పర్తివాసులు


ఒడిస్సీ శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

సంప్రదాయ కళా వైభవం

ఐఐటీహెచ్‌లో మైమరపింపజేసిన సంగీత కచేరీ, నృత్య ప్రదర్శనలు

కంది, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఐఐటీహెచ్ సంప్రదాయ కళావైభవాన్ని చాటుతోంది. కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో నాలుగో రోజైన గురువారం స్పిక్ మైకే అంతర్జాతీయ వేడుకలో సంగీత కచేరీలు, జానపద నృత్యాలు అందరిని అలరించాయి. దేశ, విదేశాల నుంచి వచ్చిన విద్యార్థులు, కళాకారులు, కళాభిమానులతో ఐఐటీహెచ్ ప్రాంగణం సందడిగా మారింది. గురువారం ఉదయం భహత, నాద్ యోగా, ధ్యానం శ్రమదాన్, ఇంటెన్సివ్ వర్క్‌షాప్‌లు జరిగాయి. మధ్యాహ్నం పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత పండిట్ హరిప్రసాద్ మధురమైన వేణుగాణ ప్రదర్శన అందరిని మైమరపింపచేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన కబీర్ గయాన్ కళాకారుడు ప్రహ్లాద్ సింగ్ టిపానియా, కబీర్ ద్విపద ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ఐక్యతకు లోతైన ఆలోచనను మేల్కొల్పాయి. మాల్వా జానపద సంప్రదాయంలో పాతుకుపోయిన టిపానియా సంగీతం, సామాజిక సామరస్యంపై కబీర్ బోధనల కట్టిపడేశాయి. డాక్టర్ జయత్రీత్ మేవుడి హిందుస్థానీ వోకల్ సంగీతంతో అలరించారు. ఖుముక్చమ్ రోమేంద్రో సింగ్ పంగ్ చోలోమ్, దాతుక్ రాంలీ ఇబ్రహీం ఒడిస్సీ, విదుషి ఎ.కన్యాకుమారి కర్ణాటక వయోలిన్, విదుషి అశ్విని బిడే దేశ్‌అభిషేక్ రఘురామ్ కర్ణాటక గాన కచేరీ అబ్బురపరిచింది. పాండే హిందుస్థానీ గాత్రం కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ శాస్త్రీయ కచేరీలు, జానపద ప్రదర్శనలు, ఆధ్యాత్మిక పఠనాల ద్వారా ఈ సమావేశం భారతీయ వారసత్వాన్ని నిలబెడుతుందన్నారు. తరువాతి తరం హృదయాల్లో అవగాహన కలిగించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

స్పిక్ మైకే సేవలు అమోఘం

1977లో ఖరగ్‌పూర్‌లో స్థాపించిన స్పిక్ మైకే (సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్స్ యూత్) దేశమంతటా సంస్కృతీసాంప్రదాయాన్ని ఏకం చేసిందని ప్రముఖ సంగీత విద్వాంసులు, సాహితీవేత్తలు, కవులు, కళాకారులు ప్రసంసించారు. స్పిక్ మైకే అనేది ఏళ్ల లాభాపేక్షలేని, స్వచ్ఛంద సేవకుల నేతృత్వంలోని నడుస్తున్న ఒక ఉద్యమమని వారు అభివర్ణించారు. ఇది యువతలో భారతీయ శాస్త్రీయ సంగీతం, నృత్యం, సంస్కృతిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు.

> **ఈ ఫేస్ మాస్క్‌లు ఎంతో ప్రత్యేకం**
>
> అస్సాంలోని మజులి జిల్లాకు చెందిన సంప్రదాయ ఫేస్‌మాస్క్ తయారీ కళాకారుడు, పద్మశ్రీ గ్రహీత, డాక్టర్ హేమచంద్ర గోస్వామి ఐఐటీహెచ్ విద్యార్థులకు మాస్క్‌లు తయారీలో శిక్షణ అందించారు. ఆయన చేతితో తయారు చేసిన మాస్క్‌లు 15-16వ శతాబ్దపు సాధువు శ్రీమంత శంకరదేవ ప్రవేశపెట్టిన నవ-వైష్ణవ సంప్రదాయంలో పాతుకుపోయిన భక్తి నాటక ప్రదర్శనలను సూచిస్తాయి. దేవుళ్లు, దేవతలు, రాక్షసులు, జంతువులు, పక్షుల మాస్క్‌లు ఉంటాయి. వీటిలో రావణుడు, గరుడ, నరసింహ, హనుమంతుడు, వరాహ, శూర్పణఖ వంటి పాత్రలు ఉన్నాయి. ఈ మాస్క్‌లకు వెదురు, బంకమట్టి, పేడ, వస్త్రం, పత్తి, కలప, నదీ ప్రాంతాల నుంచి లభించే ఇతర పదార్థాలతో తయారు చేస్తారు.





మణిపూర్ ప్రాచీన కళ పంగ్‌చోలం నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు, పేపర్, క్లాత్‌తో ఫేస్ మాస్క్‌లు తయారు చేయించిన హేమచంద్రగోస్వామి

న్యూస్ బాక్స్

విద్యుత్ బిల్లు కోసం రూ.15 వేల విరాళం

నారాయణఖేడ్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో వివిధ పోటీ పరీక్షల కోసం నిరుద్యోగ యువకులు, అభ్యర్థులు సన్నద్ధమౌతున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో బకాయిలు రూ.15 వేలకు పేరుకుపోయాయి. దీంతో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ విషయాన్ని నిరుద్యోగులు ఎన్ఆర్ఐ, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవసరమైన రూ.15 వేల చెక్కును సంబంధిత అభ్యర్థులకు గురువారం అందజేశారు.

తుకారాంతండాలో ఆలయ శిఖరోత్సవం

నారాయణఖేడ్, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సుక్కల్ తీర్థ్ తుకారాం తండాలో గురువారం నిర్మించిన భవానీ, సేవాలాల్ ఆలయ శిఖరోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐదురోజులుగా కొనసాగుతున్న వేడుకల్లో భాగంగా భవానీ, సేవాలాల్ మహరాజ్‌ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భజనలు, కీర్తనలు అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి.

మంజీరానదిలో ఇసుక పరిశీలన

చిలప్‌చెడ్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా ఇవ్వడానికి చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రి సమీపంలోని మంజీరా నదిని అధికారులు గురువారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులు సునీల్‌చౌహాన్, అసిస్టెంట్ జువాలిజిస్టు మాధురి, ఇరిగేషన్ అధికారి హరీష్, పంచాయతీ కార్యదర్శి స్రవంతి ఆధ్వర్యంలో మంజీరానదిలో ఇసుక ఉన్న తీరును పరిశీలించారు. నమూనాలు సేకరించి ఉన్నతాధికారులు నివేదించారు.

'రైతులు సేంద్రియ ఎరువులను వాడాలి'

చేగుంట, మే 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు సేంద్రియ, జీవన ఎరువులను వినియోగించుకుని పంటలు పండించాలని మెదక్ జిల్లా కృషి విజ్ఞాన్ కేంద్రం, డాక్టర్ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. నార్సింగి మండలం నర్సంపల్లితండాలో రైతులకు వానాకాలం పంటలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చేగుంట, మే 29 (ఆంధ్రజ్యోతి) : రేపు చేగుంట సబ్‌స్టేషన్ 132/33లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండలవ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వంశీకృష్ణ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్ఎస్‌జీ, ఫైనీర్, చంద్రాంచల్, చేగుంట, బోనాల, అనంతసాగర్, 33 కేవీ లైన్, చేగుంట, అనంతసాగర్, కర్నాల్‌పల్లి, చందాయపేట్, గొల్లపల్లి, కసాన్‌పల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అదుపు తప్పి.. రోడ్డు కిందికి దూసుకెళ్లి..

● ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం

టేక్మాల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ సంఘటన టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ డిపోకు చెందిన బస్సు పెద్దశంకరంపెట నుంచి సిద్దిపేటకు వెళ్తున్నది. ఈ క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పెద్దశంకరంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దశంకరంపేట మండల వైద్యాధికారి షర్ఫోద్దీన్ అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. గ్రామాల్లో సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

డీఏ బకాయిలన్నీ వెంటనే చెల్లించాలి

● తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి

నారాయణఖేడ్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఖేడ్‌లో నిర్వహించిన సంఘం డివిజన్ స్థాయి సమావేశంలో మాట్లాడారు. పీఆర్సీ గడువు ముగిసినందున వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్ బాధ్యులు చంద్రశేఖర్, మల్లయ్యస్వామి, సంజీవ్‌కుమార్, రతన్‌సింగ్, జగదీశ్వర్, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అల్లాదుర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీకి పగుళ్లు ఏర్పడిన దృశ్యం(వృత్తంలో)



ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన గది గోడకు పగుళ్లు ఏర్పడిన దృశ్యం(వృత్తంలో)



వర్షం నీటితో ముప్పారంలోని పల్లె దవాఖానా లోపలి భాగంలోని తడిసిన గోడలు

నాణ్యతకు తిలోదకాలు

- నాసిరకంగా ఆస్పత్రుల పనులు
- భవనాలన్నిటికీ పగుళ్లే
- ఇసుకకు బదులు డస్ట్ వాడిన కాంట్రాక్టర్
- ప్రమాదంలో గడిపెద్దాపూర్ ఆస్పత్రి

అల్లాదుర్గం, మే 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రభుత్వాస్పతులకు నిధులు మంజూరు చేస్తోంది. ఆస్పత్రి అభివృద్ధిలో భాగంగా చేపట్టిన భవనాల పనులు నాసిరకంగా ఉండడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. సదరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేపట్టడంతో ఆస్పత్రుల భవనాలు ప్రమాదంలో ఉన్నాయి.

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలో గడిపెద్దాపూర్, అల్లాదుర్గం పట్టణాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా ముప్పారం, చిల్వర్ గ్రామాల్లో పల్లె దవాఖానా, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు ఉన్నాయి. అల్లాదుర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతేడాది ఓ గదితో పాటు ఆస్పత్రిలో ప్రహరీ నిర్మించారు. దీంతో సదరు కాంట్రాక్టర్ ఇసుకకు బదులు డస్ట్ (రాతి పొడి) వాడడంతో ప్రహరీకి పగుళ్లు ఏర్పడ్డాయి. ఆస్పత్రిలో నిర్మించిన గది గోడలు సైతం పగుళ్లు ఏర్పడ్డాయి.

వైద్యాధికారి ముందే హెచ్చరించినా..?

మండలంలోని ముప్పారం గ్రామంలో నిర్మించిన పల్లె దవాఖానా భవనం పనుల్లో నాణ్యత పాటించలేదని అప్పటి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ అశ్విని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఆ భవనం పనులు యథావిధిగా పూర్తిచేశారు. డాక్టర్ హెచ్చరికలను ఖాతరు చేయకపోవడంతో వర్షానికి భవనం గోడలకు పదునుతో పాటు.. వర్షం నీరు లోపలికి వస్తుందని గ్రామస్థులు చెప్పారు.

శిథిలావస్థలో గడిపెద్దాపూర్ ఆస్పత్రి

మండలంలోని గడిపెద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరడంతో మరమ్మతు పనుల కోసం రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సంబంధిత కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలోని పైకప్పు పెచ్చులు ఊడిపోతుండడంతో ఏ క్షణాన ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆస్పత్రి సిబ్బంది, రోగులు భయాందోళనకు గువుతున్నారు. వర్షం వస్తే ఆస్పత్రిలోకి వర్షం నీరు చేరి చెరువును తలపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. దీంతో ఆస్పత్రి ఆవరణలో ఉన్న హోమియోపతి ఆస్పత్రి భవనంలోని ఓ గదిలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణాలపై విచారణ జరిపి, ప్రమాదాలు నివారించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పేదవారిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

కల్హేర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఇల్లు లేని పేదవారిని ఆదుకోవడానికే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే పీ.సంజీవరెడ్డి అన్నారు. సిర్గాపూర్ మండలంలోని లక్ష్మణ్ నాయక్‌తండా, సిర్గాపూర్, కడ్పల్, ఖాజాపూర్, పోచాపూర్, గోసాయిపల్లి, బొక్కస్‌గామ్, అంతర్గాం గ్రామాల్లో ఎమ్మెల్యే గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. బొక్కస్‌గామ్ పీఏసీఎస్‌లో రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మనీష్‌పాటిల్, డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మునిపల్లి మండల పరిధిలోని పెద్దలోడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్‌రావు గురువారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఏవో అనితారెడ్డి, ఏఈవో రహమాన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సిర్గాపూర్‌లో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

రోడ్డు భద్రతను మెరుగుపర్చాలి : కలెక్టర్

మెదక్ అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతను మెరుగుపరచడం ద్వారా ప్రజల ప్రాణాలు కాపాడవచ్చని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రహదారి భద్రతపై జిల్లాస్థాయి నెలవారి సమీక్ష నిర్వహించారు. ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ జాతీయ రహదారి ద్వారా చేపట్టే ప్రణాళిలను చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రమాదాలను తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను కఠినంగా అమలు చేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇందులో కలెక్టర్, ఎస్పీ పాల్గొని మాట్లాడారు. భూ భారతిలో సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న లైసెన్స్ సర్వేయర్ల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పక్కన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమమే లక్ష్యం

● టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమమే లక్ష్యమని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమశేఖర్ అన్నారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి శాంతినగర్‌లోని ఉపాధ్యాయ భవన్‌లో గురువారం టీపీటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భవిష్యత్‌లో పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి టీపీటీఎఫ్ ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ఫెడరేషన్ ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్యయాదవ్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, రాజారెడ్డి, భూమిశ్రీనివాస్, ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, మల్లికార్జున్, కార్యదర్శులు నర్సింలు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. నారాయణఖేడ్‌లో గురువారం టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వెంకట్, బాబురావు, రాజేష్, దీపక్, విజయ్‌కుమార్, కిష్టయ్య మాట్లాడారు.



సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్‌లో టీపీటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న సోమశేఖర్

అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నిబద్ధతతో పనిచేయాలి

అల్లాదుర్గం, మే 29 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నిబద్ధతతో పనిచేయాలని మెదక్ జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి హైమావతి ఆదేశించారు. గురువారం అల్లాదుర్గం మండలం నీలకంఠపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఆహార పదార్థాల నిల్వలను పరిశీలించారు. అనంతరం అల్లాదుర్గంలోని సీడీపీవో కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లతో సమీక్షా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఆయా కేంద్రాల్లో పోషణ లోపంతో ఉన్న చిన్నారులను గుర్తించి, వారికి పోషకాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పద్మలత, పోషణ్ భియాన్ జిల్లా సమన్వయకర్త కుర్మ వెంకట్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కాలనీల్లో సదుపాయాల కల్పనకు నిధులు : ఎమ్మెల్యే



సీసీరోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ

రామచంద్రాపురం టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అన్నారు. గురువారం భారతీనగర్ డివిజన్ పరిధి ఎంఐజీ కాలనీలో రూ.93 లక్షలతో నిర్మించబోయే సీసీరోడ్డు పనులు, రూ.23.5 లక్షలతో నిర్మించిన షటిల్ కోర్టులను కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో రాజీ పడవద్దన్నారు. కాలనీవాసులు నిత్యం క్రీడల్లో పాల్గొనడానికి వీలుగా షటిల్‌కోర్టు నిర్మించామని వివరించారు. సీ పార్కు వీధిలో మురుగు సమస్య పరిష్కరించడానికి రూ.10 లక్షలు మంజూరు చేయించే విధంగా జలమండలి అధికారులతో చర్చిస్తామని వివరించారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలి




అల్లాదుర్గం మండలం చిల్వర్‌లో డంపింగ్‌యార్డును పరిశీలిసస్తున్న డీఎల్పీవో సురేష్‌బాబు

అల్లాదుర్గం, మే 29 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని డీఎల్పీవో సురేష్‌బాబు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. గురువారం అల్లాదుర్గం మండలంలోని చిల్వర్ గ్రామపంచాయతీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతివనం, వన నర్సరీ, శ్మశానవాటికను పరిశీలించి మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట ఎంపీవో లింగప్ప తదితరులు ఉన్నారు.

పలు మండలాల్లో భారీ వర్షం

● మర్పల్లిలో పొంగిన వాగు



వర్షానికి గండిపడిన ఊరకట్ట చెరువు

రేగోడు/నారాయణఖేడ్, మే 29 (ఆంధ్రజ్యోతి) : రేగోడుతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. మర్పల్లిలోని వాగు ఉధృతంగా ప్రవహించింది. వ్యవసాయపనికి వెళ్లిన మహిళలు, రైతులు వాగు ఉధృతంగా ప్రవహించడంతో సాయంత్రం వరకు అక్కడే ఉన్నారు. నీటి ప్రవాహం తగ్గాక వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. అలాగే వర్షానికి రేగోడు ఊరకుంట కట్టకు గండి పడింది. నారాయణఖేడ్‌లో గురువారం మధ్యాహ్నం గంట పాటు వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి

● జిల్లా ఉద్యానశాఖ అధికారి సుచిత్ర

జహీరాబాద్/నిజాంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సుచిత్ర, నోడల్ అధికారి వరప్రసాద్, వ్యవసాయశాఖ ఏడీఏ బిక్షపతి, తదితరులు పేర్కొన్నారు. గురువారం మొగుడంపల్లి మండలంలోని గొడిగార్‌పల్లి, గుడిపల్లి, గౌసాబాద్ తదితర గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ సాంకేతికత విస్తరణ, రైతులకు వ్యవసాయ సాగు విధానంలో అవగాహన కల్పించడం, ప్రభుత్వ పథకాలను అందించే ఉద్దేశంతో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, అధికారులు సేవానాయక్, హసేనుద్దీన్, పండరి, రైతులు పాల్గొన్నారు. పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఐటీఆర్ఆర్ శాస్రవేత్తలు చిన్నబాబునాయక్ సూచించారు. మండల పరిధిలోని నస్కల్‌లో కేవీకే విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి పంట సస్యరక్షణ చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ జాన్‌దాస్, శ్రీకాంత్, వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, ఏఈవో శ్రీలత, మాజీ ఎంపీపీ సిద్ధరాములు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నర్సాపూర్/కోహీర్/హవేళిఘణపూర్/కల్హేర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ అధికారులు బృందం హెచ్చరించింది. నర్సాపూర్‌లోని ఎరువులు, విత్తనాల దుకాణాలను ఎస్ఐ లింగం, వ్యవసాయ అధికారి దీపిక తనిఖీ చేశారు. కోహీర్ మండలంలోని కవేలి చౌరస్తా వద్ద గల ఫర్టిలైజర్ దుకాణాలను ఏవో నవీన్, ఎస్ఐ సతీష్ గురువారం పరిశీలించారు. హవేళిఘణపూర్ మండలంలోని హవేళిఘణపూర్, భూర్గుపల్లి, వాడి, రాజిపేట, ఫరీద్‌పూర్ ఫర్టిలైజర్ షాపుల్లో ఎస్ఐ సత్యనారాయణ, ఏవో బాల్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని ఎరువులు, విత్తనాల దుకాణాలను వ్యవసాయాధికారి హరిక్రిష్ణ, ట్రైనీ ఎస్ఐ మహేష్ పరిశీలించారు.



నర్సాపూర్‌లో ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్సు బృందం

ఘనంగా గ్రామ దేవతల విగ్రహాల ఊరేగింపు

వెల్దుర్తి, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో గురువారం బొడ్రాయి, గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా ప్రారంభమైంది. మొదటిరోజు గణపతిపూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠ, హోమం, దేవతామూర్తుల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

యోగా శిక్షకులేరీ?

5వ పేజీ తరువాయి

ఆరోగ్య మందిరాలుగా వాటిని అభివృద్ధి చేశారు. యోగా ఇన్‌స్ట్రక్టర్లు వీటిలో రోజూవారీ కార్యక్రమాలు నిర్వహించాలి. కానీ, సంగారెడ్డి జిల్లాలో యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలు జరగకపోవడంతో ఆయుష్మాన్ మందిరాల నిర్వహణ కుంటుపడింది. ఆయుర్వేదం, హోమియోపతి, యునానీ డిస్పెన్సరీల్లో ఆయా విభాగాల వైద్యులు ఉన్నప్పటికీ వారు రోజూ డిస్పెన్సరీలకు వచ్చే రోగులకు చికిత్స అందించడంతోనే సరిపోతుంది. దీంతో, ఆయూష్ శాఖ విడుదల చేసిన ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతున్నది. యోగాడే రోజూవారీ కార్యక్రమాల నిర్వహణ తమతో ఎలా సాధ్యమౌతుందని పలువురు డిస్పెన్సరీల డాక్టర్లు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఆయూష్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సంగారెడ్డి జిల్లాలో యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆరు తడి.. ఆదరణ కొరవడి!

5వ పేజీ తరువాయి

ఆయిల్‌పామ్ 456 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తారని వానాకాలం పంటల ప్రణాళికలో పేర్కొన్నారు.

మద్దతు కరువు

ఆరుతడి పంటలైన అపరాలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, మొక్కజొన్న, నువ్వులు, గోధుమ పంటల సాగును పెంచేందుకు రైతులకు ప్రోత్సాహం అందిస్తేనే రైతులు ఆసక్తి పెంచుకునే అవకాశం ఉంది. సాగుకు అవసరమైన విత్తనాలపై సబ్సిడీ ఇవ్వాలని, సూక్ష్మ, బిందు సేద్యం పరకరాలు, పంట మార్పిడి యంత్రాలను రైతులకు అందించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆరుతడి పంటల సాగుతో కలిగే ప్రయోజనాలపై పల్లెల్లో ప్రచారం చేయాలని పేర్కొంటున్నారు. వరి అంచనాలకు మించి సాగవుతుండడంతో విద్యుత్ వినియోగం పెరిగి, భూగర్భజల మట్టాలు అడుగంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో ఉన్న విత్తనాలు

జిల్లాలో వానాకాలం సాగుకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విన్సెంట్ తెలిపారు. వరి 91,530 క్వింటాళ్లు కావాల్సి ఉండగా.. ప్రస్తుతం 7,041 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పత్తి విత్తనం 74,400 ప్యాకెట్లకు గానూ ప్రస్తుతం 57,671 ప్యాకెట్లు మార్కెట్‌లో ఉన్నాయని తెలిపారు. 264 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలకు గానూ ప్రస్తుతం 55 క్వింటాళ్లు, జొన్న క్వింటాలు, పెసర 6 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎరువులు 57,930 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళికలో పేర్కొంది.

అంబేడ్కర్ చూపిన బాటలో నడుచుకోవాలి



శిఖార్‌కానాలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నాగల్‌గిద్ద, మే 29 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ చూపిన బాటలో నడుచుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని శిఖార్‌కాన గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం అంబేడ్కర్ ప్రత్యేకంగా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానిక్యం, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింలు, సహాయ కారదర్శి గణపతి, నాయకులు గుండేరావుపాటిల్, రహీం, రాజు, అంబేడ్కర్ యువజన సంఘాల బాధ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

పటాన్‌చెరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఇస్నాపూర్ మున్సిపల్ పరిధి చిట్కుల్ ఇషా బ్లూమ్స్ కాలనీలో రూ.15 లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

'శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి'

మెదక్ అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణ సీఐ నాగరాజు అధ్యక్షతన గురువారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో అన్ని మతాల పెద్దలతో నిర్వహించిన శాంతి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. గోవులను అక్రమంగా రవాణా చేసినా, వధించిన చర్యలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ పాల్గొన్నారు.

పిల్లలను సర్కార్ బడుల్లో చేర్పించండి

● టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్

నారాయణఖేడ్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించి వారి జీవితాలను బంగారు మయం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్ కోరారు. గురువారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట జాతలో భాగంగా మండల పరిధిలోని జూజాల్‌పూర్, తదితర గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులతో పాటు విశాలమైన తరగతి గదులు, ఉన్నత విద్యలు చదివిన ఉపాధ్యాయులు, ఉండడానికి తోడు ఉచిత నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు అందజేస్తారన్నారు.

విద్యాపీఠంలో సరస్వతీ తీర్థ మహోత్సవం

సంగారెడ్డి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో బుధవారం సాయంత్రం సరస్వతీ తీర్థ మహోత్సవం నిర్వహించారు. విద్యాపీఠం ఆశ్రమ వ్యవస్థాపకులు మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఆశ్రమ సేవక బృందం ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి పుష్కర తీర్థాన్ని భక్తులకు సంప్రోక్షణ చేశారు. ఈ సందర్భంగా సిద్ధాంతి మాట్లాడుతూ 11 ఏళ్లుగా విద్యాపీఠం పుష్కర స్నాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సంగారెడ్డి అర్బన్/రామాయంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని హోమియోపతి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.నర్మదషిండే అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ శాఖ డే టు డే కార్యక్రమంలో భాగంగా సీనియర్ సిటిజన్స్ యోగా సమావేశాన్ని సంగారెడ్డి కలెక్టరేట్ వెనుక పార్కులో గురువారం నిర్వహించారు. డా.నర్మద మాట్లాడుతూ దినచర్యలో యోగా భాగం కావాలని సూచించారు. రామాయంపేటలో యోగా శిక్షకుడు మద్దెల భరత్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కల్పిస్తున్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

నర్సాపూర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలం గొల్లపల్లిలో నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. మొదటిరోజు గురువారం గణపతిపూజ, గోపూజ, స్వస్తి వాచకము, పంగవ్యప్రాసన, పుణ్య హవచనం, యాగశాల ప్రవేశం తదితర పూజలు పురోహితులు హరిప్రసాద్‌శర్మ బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు.